# శవరహస్యం

మల్లాది వెంకట కృష్ణమూర్తి

పాశ్చాత్య దేశాల నుంచి మొదటిసారి భారతదేశానికి వచ్చిన వారికి కలిగే షాక్ జాన్ డేనియల్‌కి, అతని భార్య షైర్లీకి కూడా కలిగింది. ఢిల్లీ ఎయిర్‌పోర్టులోని కస్టమ్స్ సిబ్బంది అమర్యాదగా వ్యవహరించిన తీరు, ఢిల్లీ నించి రుషికేశ్‌కి వెళ్లేదాకా గల రోడ్లు, జనం, దారిలో ఆగిన డాబాలో కట్టెలతో వండే తీరు, వెయిటర్స్ ప్రవర్తన అంతా వారికి షాకింగ్‌గా ఉంది. ఇలా ఉంటుందని వారికి షైర్లీ తమ్ముడు గార్డనే ముందే చెప్పినా విని ఊహించుకోవడం వేరు, స్వయంగా అనుభవించడం వేరు. భారతదేశం నుంచి పాశ్చాత్య దేశానికి మొదటిసారి వెళ్లిన వారికి కొద్ది గంటల్లోనే మెచ్చుకోలు భావన ఎలా మొదలవుతుందో, అలా జాన్ డేనియల్‌కి, షైర్లీకి ఓ విధమైన వెగటు భావం మొదలైంది.



''ఇండియన్స్‌లో క్రమశిక్షణ లేదు'' పెదవి విప్పి చెప్పింది షెర్లీ.

''శుభ్రత, మర్యాదపూర్వక ప్రవర్తన కూడా'' ఒప్పుకుంటూ చెప్పాడు జాన్.

'' వీరి రోడ్లు, వాహనాలు చూస్తే ఇది ఎంత బీద దేశమో తెలిసిపోతోంది. అరె! ఇందాక హోటల్‌లో రొట్టెను చేత్తో చేస్తారే? వెయిటర్ నీళ్ల గ్లాసులో వేళ్లు ముంచి పట్టుకొస్తాడే? ''

''మీ తమ్ముడు మనల్ని ముందే హెచ్చరించాడు. అయినా ఇంత ఇదిగా ఉంటుందనుకోలేదు.'' చెప్పాడు జాన్.

వారి టాక్సీ రుషికేశ్‌లోని ఓ పెద్ద హోటల్ ఆవరణలోకి ప్రవేశించింది. డ్రైవర్‌కి దాని పేరు చెప్పగానే గుర్తుపట్టి అక్కడికి చేర్చాడు.

డిక్కీలోని తమ రెండు సూట్‌కేసులనీ దించి, ఎయిర్ బేగ్స్‌ని, లాప్‌టాప్ బేగ్‌ని భుజాన తగిలించుకుని చక్రాలున్న అమెరికన్ టూరిస్టర్ సూట్‌కేస్‌లని లోపలికి లాక్కెళ్లారు.

వాళ్ళ గది సిద్ధంగా ఉంది. నియమాల ప్రకారం తమ పాస్‌పోర్ట్‌లని రిసెప్షన్‌లో ఇచ్చారు. తమకి కేటాయించిన గదిలోకి బెల్‌బాయ్ తీసుకెళ్ళగా వెళ్ళారు. పదహారు గంటలు విమానంలో హోస్టన్ నించి ప్రయాణించి రావడంతో వారి శరీరాలు విశ్రాంతిని కోరుతున్నాయి. మనసుకి మాత్రం మునికిరేతిలోని దీక్షిత్ దగ్గరకు వెళ్ళాలని వుంది. కానీ చివరికి శరీరాలే గెలిచి మనసులు ఓడిపోయాయి.

ఇద్దరూ స్నానాలు చేసి పక్కమీద వాలిపోయారు.

***

మర్నాడు ఉదయం హోటల్‌లోంచి బయటకి రాగానే ఓ చోట గట్టుమీద కూర్చుని ఉన్న డ్రయివర్ వీళ్ళని చూసి, కాల్చే సిగరెట్‌ని పారేసి సలాం చేసి వెళ్ళి కారు తలుపులు తెరిచాడు. ఇద్దరూ వెనక సీట్లో కూర్చున్నాక , తలుపులు మూసి కారు స్టార్ట్ చేసాడు డ్రయివర్.

మునికిరేతి చిరునామా చెప్పాడు జాన్. తనకి ఆ ఇల్లు తెలుసన్నట్లుగా తలాడించి డ్రైవర్ కారుని హోటల్ ఆవరణలోంచి బయటకి తెచ్చి , కుడివైపు తిప్పి ముందుకు పోనిచ్చాడు.

వారిద్దరూ చెరో కిటికీలోంచి ఆ సన్నటి సందులని, రోడ్లమీద నడిచే మనుషులని, ద్విచక్రవాహనాలని, ఆటోలనీ ఆసక్తిగా గమనించారు. అమెరికాలో ఎక్కడైనా చూద్దామన్నా కనపడని ఆ కొత్త పరిసరాలు, వాతావరణం వారికి ఆసక్తిగా వుంది. రోడ్లమీద అంతమంది మనుషులు ఉండడం వీళ్ళకి విచిత్రంగా వుంది. అమెరికాలో కార్లు తప్ప రోడ్ల మీద మనుషులు కనపడరు –న్యూయార్కులాంటి రెండు మూడు వూళ్ళని మినహాయిస్తే.

వీరి కారు , ఇంకో కారు ఎదురొస్తే వెళ్ళలేనంత సన్నటి సందులోని ఓ పెద్ద భవంతి ముందు ఆగింది. ఇద్దరూ కారు దిగి లోపలకి వెళ్ళారు. బయట 'వి.ఆర్ దీక్షిత్, పామ్-ఏ స్ట్రో స్పెషలిస్ట్' అన్న బోర్డుని చూసారు. ముందుగదిలోని ఓ పాతికేళ్ళ యువకుడు వీరి వంక చూసి ఇంగ్లీష్‌లో అడిగాడు.

''యస్? హౌ కెన్ ఐ హెల్ప్ యూ? ''

'' నా పేరు జాన్ డేనియల్. ఈమె నా భార్య షెర్లీ. ఇవాళ రాత్రి ఎనిమిదికి దీక్షిత్‌తో నాకు అపాయింట్‌మెంట్ వుంది.'', చెప్పాడు.

'' కూర్చోండి''

ఇద్దరూ పేము కుర్చీల్లో కూర్చున్నారు. గోడలకి వాళ్ళంత దాకా చూడని బొమ్మలున్నాయి. రకరకాల ఆభరణాలు ధరించిన వాటిలో కొన్ని మగవారివి, కొన్ని ఆడవారివి. అవన్నీ హిందూ దేవుళ్ళు, దేవతల బొమ్మలనుకున్నారు. గతంలో ఎక్కడో చూసిన వినాయకుడి బొమ్మని గుర్తించారు.

అయిదారు నిమిషాల తర్వాత ఇందాకటతను వచ్చి చెప్పాడు.

'' ప్లీజ్ ఫాలో మి ''

ఇద్దరూ లేచి అతని వెంట లోపలికి వెళ్ళారు. విశాలమైన ఏర్ కండిషన్డ్ గదిలో నేలమీద పరిచిన తెల్లటి పట్టుపరుపుమీద ఓ వృద్ధుడు కూర్చుని ఉన్నాడు. అతని వయస్సు అరవై అయిదు- డెబ్భై దాకా వుండచ్చనుకున్నారు. దీక్షిత్‌కి వాళ్ళని పరిచయం చేసాడా యువకుడు.

'' వీరికి ఇంగ్లీష్ రాదు. నేను మీ దుబాసీని. పేరు శర్మ''

పరిచయం చేసుకున్నాడు ఆ కుర్రాడు.

వాళ్ళిదర్నీ తన ఎదుట కూర్చోమన్నట్లుగా దీక్షిత్ నవ్వుతూ సైగ చేసాడు. ఆ ఇద్దరూ కూర్చున్నాక, ఆ యువకుడు ఓ వెండి పెట్టెని తెచ్చి వాళ్ళ ముందు తెరిచాడు. లోపల నల్లటి ప్రింటింగ్ ఇంక్, ఓ రోలర్ ఉన్నాయి. అతను వెండి పిడి గల ఆ రోలర్‌ని ఆ ఇంక్ మీద రుద్ది ఒక్కొక్కరి అరచేతులూ చాపమని రెండు చేతులకి ఆ నల్లటి రంగుని రోలర్‌తో పూసాడు. తర్వాత ఓ తెల్ల కాగితం మీద ఆ అరచేతులని ఉంచి, పైన చేత్తో అదిమి తీసాడు.

ఆశ్చర్యంగా ఆ తెల్లటి కాగితం మీద గీతలు స్పష్టంగా తెల్లగా కనపడుతూ రెండు చేతుల అచ్చులూ పడ్డాయి.

వారిని బాత్‌రూంలోకి తీసుకెళ్ళి నల్లగా ఉన్న వారి అరచేతుల్లో కొద్దిగా కొబ్బరినూనె పోసి వాష్ బేసిన్ మీద ఉన్న సబ్బుని చూపించాడు. ఆ మసి తేలిగ్గానే వదిలింది. టవల్‌తో చేతులని తుడుచుకుని ఇద్దరూ ఆ గదిలోకి వచ్చారు. అప్పటికే దీక్షిత్ భూతద్దంతో వారి అరచేతుల అచ్చులని శ్రద్ధగా పరిశీలిస్తున్నాడు.

వారి పేరు, చిరునామా, తేదీలని ఎవరి అచ్చుల కాగితం మీద వారివి రాయించి సంతకాలు తీసుకుని చెప్పాడు ఆ యువకుడు నవ్వుతూ.

''భవిష్యత్తులో మీరు గొప్పవారైనా లేదా మీ అబ్బాయి అమెరికన్ ప్రెసిడెంట్ అయినా అప్పుడు వీటిని మీరు మా దగ్గరకి వచ్చారని రుజువు చేస్తూ మేం ప్రకటించుకోడానికి''

''నాకు మిస్టర్ గార్డన్ గుర్తున్నారు. రెండు నెలల క్రితం అనుకుంటా మా దగ్గరికి వచ్చారు '' చెప్పాడు దీక్షిత్.

''అవును. అతను నా తమ్ముడు. '' చెప్పింది షెర్లీ.

'' మీరు ఇవాళ వస్తున్నట్లు నిన్న అతను ఫోన్ చేసి చెప్పారు....వాయిస్ రికార్డర్ తీసుకువచ్చారా? '' అని అడిగాడు శర్మ.

''ఓ యస్'' జేబులోంచి డేనియల్ అగ్గిపెట్టె పరిమాణంలో ఉన్న వాయిస్ రికార్డర్‌ని బయటకి తీసి పక్కన ఉంచాడు.

ఓ అయిదారు నిమిషాలు ఆ గదిలో నిశ్శబ్దం. దీక్షిత్ జాగ్రత్తగా ఇద్దరి చేతి రేఖలని పరిశీలిస్తూ, మధ్య మధ్యలో ఫోన్‌లో ఏదో వింటూ జవాబు చెప్తున్నట్లుగా 'ఆహో ఓహో ' అనసాగాడు. తర్వాత భూతద్దం పక్కన పెట్టి ఇద్దరి వంక నవ్వుతూ చూసాడు. తర్వాత ఆయన నవ్వుతూ యువకుడి వంక చూసాడు. ఆ చూపులోని అర్థం గ్రహించినట్లుగా ఆ యువకుడు అడిగాడు.

'' ఫీజ్ గురించి మిస్టర్ గార్డన్ మీకు చెప్పారనుకుంటాను''



''అవునవును. వెయ్యి డాలర్లు...ఇండియన్ కరెన్సీలో ఇవ్వాలా? ''

''డాలర్లయినా ఫర్వాలేదు''

షెర్లీ తన హేండ్ బ్యాగ్‌లోంచి గుండ్రంగా, నిలువుగా మడిచి, చిన్న రబ్బర్ బేండ్ వేసిన ఇరవై యాభై డాలర్ల నోట్ల కట్టని అందించింది అతను రబ్బర్ బేండ్ తీసి వాటిని లెక్కపెట్టి, తన వంక చూస్తున్న దీక్షిత్ వంక చూసి అంతా సవ్యంగా ఉందన్నట్లుగా తల ఊపాడు. తర్వాత వీళ్ళకి కొద్ది దూరంలో కూర్చుంటూ చెప్పాడు.

'' రికార్డర్‌ని ఆన్ చేయండి. ఆయన మొదలుపెడుతున్నాడు.''

దాదాపు గంటసేపు దీక్షిత్ అనర్గళంగా చెప్తుంటే, శర్మ అదే వేగంతో అనువదించి చెప్పాడు. అది వింటున్న వారిద్దరి మొహాల్లో సంభ్రమం అధికం కాసాగింది. కొన్ని సందర్భాల్లో ఇద్దరూ ఆశ్చర్యంగా ఒకరి మొహాలు మరొకరు చూసుకోసాగారు. తమకి సంబంధించినవన్నీ దీక్షిత్ అక్షరం పొల్లుపోకుండా టకటక ఆ రేఖలని చూస్తూ, పుస్తకంలోంచి చదివినట్లుగా చెప్తున్నాడు.

''ఈ జాతకులిద్దరూ భార్యాభర్తలు. వీరికి వివాహమై పదమూడు సంవత్సరాల ఏడు నెలల ఆరు రోజులయ్యాయి. వీరికి మొదటి సంతానంగా పుట్టిన బిడ్డ మరణించి పుట్టాడు. రెండో సంతానం కుడికాలు అవిటి. అయినా మేధస్సు గట్టిది. వాడి వయసు ఎనిమిదేళ్ళ నాలుగు నెలల రెండు రోజులు. రెండో సంతానం ఎలా పుడుతుందో అనే భయంతో మళ్ళీ కనలేదు. వీరికి ఇంకో సంతానం సంపూర్ణ ఆరోగ్యంతో కలుగుతుంది. వీరు ఏడాదిన్నర క్రితం ఇంటి అప్పులోంచి బయటపడ్డారు. జాన్ తండ్రి యుద్ధంలో పనిచేసాడు. ఐతే యుద్ధరంగానికి వెళ్ళాల్సిన అవసరం రాలేదతనికి. తల్లి నర్స్. షెర్లీ తండ్రి ఓ దుకాణం యజమాని. బహుశా ఔషధాల దుకాణమై ఉండొచ్చు. అతను పోయి నాలుగేళ్ళయింది. తల్లి పోయి ఇరవై ఆరేళ్ళయింది....''

వాళ్ళిద్దరూ ఎక్కడ కలుసుకున్నారో కూడా చెప్పాక, వచ్చే అయిదేళ్ళలో వాళ్ళ జీవితాల్లో జరిగే ముఖ్యమైన సంగతులు చెప్పాడు. గంట తర్వాత దీక్షిత్ చెప్పేది పూర్తయింది.

''మీ జీవితాల్లో జరిగింది వారు చెప్పారు. అవన్నీ కరక్టేనా? '' అడిగాడు శర్మ.

''పూర్తిగా. మాకు ఆశ్చర్యంగా వుంది.'' చెప్పింది షెర్లీ.

''మీకు అనుమానాలు, ప్రశ్నలు ఏమైనా ఉంటే అడగండి''

షెర్లీ వెంటనే అడిగింది.

''మాకు సంతానం మళ్ళీ ఎప్పుడు కలుగుతుంది? ''

ఆ ప్రశ్నని శర్మ హిందీలోకి అనువదించి అడిగాడు. దీక్షిత్ నవ్వి,

జవాబు చెప్పాక శర్మ కూడా నవ్వి ఇంగ్లీష్‌లో చెప్పాడు.

''మీరు అవి వాడటం మానేయగానే ''

తన వ్యాపారానికి చెందిన కొన్ని సమస్యల గురించి అడిగి సందేహ నివృత్తి చేసుకున్నాడు జాన్.

''మరో నాలుగేళ్ళలో ఏదో ప్రమాదం జరగబోతోందన్నారు. ఏమిటది? '' అడిగింది షెర్లీ.

ఆయన భూతద్దం అందుకుని మళ్ళీ చేతిరేఖల అచ్చుని కాసేపు పరిశీలించి చూసి చెప్పాడు.

''అగ్ని ప్రమాదం లేదా జల ప్రమాదం ''

'' దాన్ని నివారించడం ఎలా? ''

'' పూజ మీద నమ్మకం ఉంటే, ఇక్కడ నవగ్రహ పూజ చేసుకుని వెళ్ళండి ''

''ఎంతవుతుంది ఖర్చు?''

''రెండు వేలరూపాయలదాకా''

''మరో రెండేళ్ళలో ఊరు మారతామన్నారు. ఎక్కడికి మారతాం? ''

''పేరు చెప్పలేను కాని మీరున్నచోటుకి పశ్చిమదిశవైపు ఉన్న ఊరు ''

''మా పుట్టింటి వైపు వారిలో ఒకరికి ఆ ఏడాది మరణం ఉందన్నారు. ఎవరికి? ''

''బహుశా మీ చెల్లెలికి, గార్డన్ చేతిని చూసి కూడా చెప్పి వుంటాను బహుశా ''

''ఇదంతా ఇంత ఖచ్చితంగా ఎలా తెలుస్తుంది మీకు? '' అడిగాడు జాన్.

''శాస్త్రాధ్యయనం వల్ల . జ్యోతిష శాస్త్రాన్ని, సంస్కృత పండితుల దగ్గర పన్నెండేళ్ళు అభ్యాసించాను''

'' మీరు అమెరికా రావడం కుదురుతుందా? నా మిత్రులు చాలా మంది..''

''కుదరదు. ఎందరో అడిగారు. అడిగినప్పుడల్లా వెళ్ళి వుంటే ఈ పాటికి ప్రపంచం అంతా ఎన్నో సార్లు చుట్టే వాడిని. సముద్రం దాటను. అందుకు ఈ శాస్త్రం ఒప్పుకోదు''


గంటంపావు తర్వాత దీక్షిత్ విజిటింగ్ కార్డు తీసుకుని, పూజకి రెండువేలు చెల్లించి బయటకు వచ్చారు. హోటల్‌గదికి చేరుకున్నాక వాళ్ళ వాయిస్ రికార్డర్‌లో రికార్డయింది శ్రద్ధగా మరోసారి విన్నారు. ఈసారి షెర్లీ తన డైరీలో అందులోని ముఖ్య సమాచారం రాసుకుంది.

ఆ రాత్రంతా వారు ఓ విధమైన సమ్మోహన స్థితిలో ఈ శాస్త్రం గురించి మాట్లాడుకున్నారు. ఎలాంటి ప్రచారం లేకుండా భారతదేశంలోని ఓ చిన్న ఊళ్ళో అంతటి మహా పండితుడు ప్రపంచానికి తెలీకుండా అనామకుడిగా ఉండటం వాళ్ళకి నచ్చలేదు.

ఇదే అమెరికన్ అయితే ఎన్ని రకాలుగా ప్రచారం చేసుకుని, ఎంత డబ్బు సంపాదించేవాడో కదా అనుకున్నారు.

మర్నాడు వాళ్ళు గంగా స్నానం చేసి శర్మ ఇచ్చిన అడ్రస్ ప్రకారం ఓ ప్రాచీన శివాలయం ఆవరణలోకి వెళ్ళారు. శర్మ వాళ్ళకోసం పూజారితో ఎదురుచూస్తున్నాడు. శర్మ సూచనల ప్రకారం నవ గ్రహాలకి తొమ్మిదిసార్లు ప్రదక్షిణ చేసి శనికి తైలాభిషేకం చేసారు. చిన్న హోమం కూడా జరిగింది. కార్యక్రమం అంతా ముప్పావు గంటలో ముగిసింది. పూజారికి వందరూపాయలు టిప్ ఇచ్చాడు జాన్.

ఆ రోజు రుషికేశ్‌లోని ఆలయాలని, ఆశ్రమాలని చూసి మర్నాడు ఉదయం కారులో బదరీనాథ్‌కి రాత్రికి చేరుకున్నారు. అదంతా వారికి సరికొత్త ప్రపంచం. ఉష్ణకుండంలో స్నానం చేసి బదరీనారాయణుడ్ని దర్శించారు. కారులో, కొద్దిదూరంలో ఉన్న భారతదేశపు ఆఖరి గ్రామం అయిన మానాకి వెళ్ళారు. అక్కడి నుంచి వినాయక గుహ, సరస్వతీ నదిని దర్శించి మళ్ళీ కారులో విష్ణు పాదాలున్న పర్వత పాదం దగ్గర కారు దిగి పైకి ఎక్కారు. అక్కడి నుంచి చూస్తే కింద బదరీ మొత్తం కనబడుతోంది. ఓ పెద్దబండరాయి మీద ఉన్న విష్ణు పాదాలకి అందరిలా నమస్కరించి చుట్టూ తిరిగారు. వాళ్ళు దైవారాధన కన్నా ప్రకృతి ఆరాధన చేసారు.



హిమాలయ అందాలు వారిని బాగా ఆకట్టుకున్నాయి.

వాళ్ళు కిందకి దిగుతూంటే మొలకి కౌపీనం మాత్రం ధరించి, భుజాన ఓ మూటతో ఓ సన్నటి మనిషి ఎదురయ్యాడు.

''జయహో'' చేతినెత్తి వాళ్ళని ఆశీర్వదించాడు.

షెర్లీ తన పర్స్ తెరిచి ఏభై రూపాయల నోటుని అతనికి అందించింది. దాన్ని అందుకుని అంతదాకా అలాంటి నోటుని చూడనట్లుగా అటుఇటూ తిప్పి చూసాడతను. తర్వాత దాన్ని పర్రున మధ్యకి చింపేసి ఆ రెండు ముక్కలని ఆ దంపతులకి చెరొకటి ఇచ్చి 'జయహో' అని అరిచి మళ్ళీ ముందుకి సాగాడు.

''పిచ్చివాడు'' చెప్పింది షెర్లీ.

మర్నాడు ఉదయం ఇద్దరూ బ్రేక్‌ఫాస్ట్ ముగించుకుని హోటల్‌గదిని ఖాళీ చేసి రుషికేశ్‌కి బయల్దేరారు. సరిగ్గా పన్నెండు గంటల తర్వాత రుషికేశ్ చేరుకుంటామని చెప్పాడు డ్రైవర్. భోజనం శ్రీనగర్‌లో చేద్దామన్నాడు. అతని ఇంగ్లీష్ ఉచ్చారణ హిందీలా ఉన్నా వాళ్ళకి అది అర్థం అయింది.

కారు జోషీమఠ్ దాటింది. పిప్పల్ కోట్ దాటుతుండగా రోడ్డు పక్కన ఓ సాధువు వేగంగా నడిచి వెళ్తూ కనిపించాడు. అతన్ని చూసి కారుని తక్కున ఆపి డ్రైవర్ దిగి వెళ్ళి ఆయన కాళ్ళకి సాష్టాంగ నమస్కారం చేసాడు. ఆ యోగి అతన్ని దీవించి తన చంకలోని మూటలోంచి ఏదో వెదికి తీసి డ్రైవర్‌కి ఇచ్చాడు.

డ్రైవర్ కారు దగ్గరకి పరిగెత్తుకొచ్చి, ఇంగ్లీష్‌లో మళ్ళీ ఏదో చెప్పాడు. జాన్‌కీ, షెర్లీకి అతను చెప్పేది చూచాయిగా అర్థమైంది. ఆ సాధువుని వెంట తీసుకెళ్దాం అంటున్నాడు.

''ఓకే'' చెప్పాడు జాన్.

డ్రైవర్ మళ్ళీ చకచక నడిచి వెళ్ళే ఆ సాధువు పక్కన కారాపి ఎక్కమని కోరాడు. అతను ఎక్కనన్నట్లుగా, కనీసం తల వెనక్కి తిప్పి కారు వంక చూడనైనా చూడకుండా వెళ్తుంటే డ్రయివర్ ఆయన్ని ఆపి బ్రతిమాలసాగాడు.

''వాట్స్ గోయింగాన్?'' విసుగ్గా అడిగింది షెర్లీ.

జాన్ అద్దం దింపి డ్రైవర్‌ని రమ్మని కేకేసాడు.

ఆ సాధువు చేతిని పట్టుకుని డ్రైవర్ తీసుకువచ్చి బలవంతంగా ముందు సీట్లో కూర్చో పెట్టాడు.

''జయహో'' వీళ్ళ వంక చూడకుండా అరిచాడు ఆసాధువు.

అతన్ని గుర్తుపట్టి ఆ దంపతులిద్దరూ ఒకరి మొహాన్ని మరొకరు ఆశ్చర్యంగా చూసుకున్నారు.

''దింపేద్దామా?'' అడిగింది షెర్లీ.

''ఎక్కాడుగా. ఏదైనా గొడవ చేస్తే తక్షణం దింపేద్దాం''

కొద్ది క్షణాల తర్వాత ముందు సీట్లోంచి ఆ సాధువు కంఠం ఇంగ్లీష్‌లో వినిపించింది.

''నేను గొడవ చేసినా దింపడం మీకు సాధ్యం కాదు''

''ఓ! మీకు ఇంగ్లీష్ వచ్చా? ఆ నోటుని ఎందుకలా చింపేసారు?'' అడిగింది షెర్లీ.

''మీ దగ్గర ఉంచుకుంటే మీకు మంచి జరుగుతుందని... మీరిద్దరు ఆ నోటులాంటివారు. కలిసి ఉంటే ప్రపంచం దృష్టిలో దానికి విలువ. మధ్యకి చిరిగితే దానికి విలువుండదు. అలానే మీరిద్దరూ విడిపోతే చిరిగిన ఆ నోటులా దేవుడి దృష్టిలో మీకు విలువ వుండదు. దీక్షిత్ మీ విడాకుల విషయం ఎత్తలేదనుకుంటాను?''

ఆ దంపతులు ఉలిక్కిపడ్డారు. ఆ ఇద్దరిలో ఎవరికీ ఏం మాట్లాడాలో తోచలేదు.

''జయహో''

''దీక్షిత్ మా గురించి మీకు చెప్పాడా?'' అడిగింది షెర్లీ కాసేపాగి.

''ఋషికేశ్‌లో లేను, నేనా రోజు సంత్‌పంత్‌లో వున్నాను. మానా గ్రామం నించి సత్‌పంత్ చాలా దూరం''

''ఐతే సెల్‌ఫోన్‌లో మాట్లాడుకున్నారా?''

''సాధువులకి సెల్‌ఫోన్ దేనికి? అది లేకుండా తెలుసుకోలేరా?''

''ఎలా తెలుసుకుంటారు?''

''సరే. నాకు సెల్‌ఫోన్ ఉండి, దీక్షిత్ మీ గురించి చెప్పాడనుకుందాం. కానీ మీరు హ్యూస్టన్ నించి వచ్చారని, మీరక్కడ వెక్సింగ్టన్ బుల్వార్డ్‌లో త్రి ఓ నైన్ నంబర్ ఇంట్లో ఉంటున్నారని, మీ ఇంటికి అయిదు వందల గజాల దూరంలో సెయింట్ పాల్స్ చర్చి వుందని, మీ ఇంటి వెనక ఉన్న లేక్ పేరు స్వాన్ లేక్ అని... ఇవన్నీ కూడా నాకు దీక్షిత్ సెల్‌ఫోన్‌లో చెప్పాడా?''

దీక్షిత్ దగ్గర కూడా వాళ్ళిద్దరూ అంతలా ఆశ్చర్యపోలేదు.

''స్టాప్ ది కార్... స్టాప్ ది కార్'' అరిచాడు జాన్.

డ్రైవర్ కంగారుగా కారు ఆపాడు. జాన్ వంక ఎందుకన్నట్లుగా చూసింది షెర్లీ. జాన్ దిగి వెళ్ళి ఆ సాధువు పక్క తలుపు తెరిచింది. ఇందాక డ్రైవర్ మొక్కినట్లుగా ఓసారి ఆయన కాళ్ళని స్పృశించాడు.

''ఇదంతా ఎలా తెలుసు మీకు?'' తడారిన గొంతుతో అడిగాడు. సాధువు అమెరికన్ పద్ధతిలో విషయం ఏమిటో తెలియదన్నట్లుగా రెండు భుజాలు ఎగరేసాడు.

''వచ్చి మా పక్కన కూర్చోండి'' కోరాడు.

సాధువు ఫకాలన్న నవ్వి లేచి చంకలోని మూటని ముందు సీటు మీదే వుంచి వెనకసీట్లో ఆ దంపతుల మధ్య కూర్చున్నాడు.

''నీ బావమరిది గార్డన్ మేలుకునే వున్నాడు. అతనికి ఫోన్ చెయ్యి చెప్తాను'' అడిగాడా సాధువు.

''దేనికి?''

''పనుంది. చెయ్యి''

షెర్లీ హేండ్ బాగ్‌లోంచి సెల్‌ఫోన్ తీసి స్పీడ్ డయల్ నంబర్ నాలుగు నొక్కింది. కొద్ది క్షణాల తర్వాత గార్డన్ గొంతు వినిపించింది.

''హాయ్''

సాధువు ఫోన్ అందుకుని, దాన్ని స్పీకర్ మోడ్‌లో వుంచి చెప్పాడు.

''గార్డన్. నీ ఇంటి దక్షిణం వైపున్న బెడ్‌రూంలో అక్వేరియంలోని చేపలకి తిండి వేస్తూ నిల్చుని వున్నావు కదా?'' ఓసారి కిటికీలోంచి బయటకి చూడు''

''ఎవరిది?''


NCMDT - ద్వారా కేంద్రప్రభుత్వరంగ సంస్థ ఆమోదిత

మల్టీమీడియా యానిమేషన్ కోర్సుల్లో శిక్షణ

కోర్సుల వివరాలు :
మాస్టర్ డిప్లమా ఇన్ మల్టీమీడియా యానిమేషన్ (MDMA)
పిజి డిప్లమా ఇన్ యానిమేషన్ టెక్నాలజి
పిజి డిప్లమా ఇన్ మల్టీమీడియా యానిమేషన్

65% వరకు ఫీజులో రాయితీ/తగ్గింపు
100% ప్లేస్‌మెంట్ అసిస్టెన్స్



NCMDT సెంటర్ ఫర్ మల్టీమీడియా డిజైన్ & ట్రైనింగ్
(ISO 9001:2000 సర్టిఫైడ్, కేంద్రప్రభుత్వరంగ సంస్థ ఆమోదిత శిక్షణాకేంద్రం)

ఉపాధి అవకాశాలు (సాఫ్ట్‌వేర్ / మల్టీమీడియా/యానిమేషన్ ప్రొఫెషనల్): MDMA కోర్సు పూర్తి చేసి ఆన్‌జాబ్ ట్రైనింగ్ (OJT) అర్హత పొందిన అభ్యర్థులకు ఆన్ జాబ్ వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్ కల్పించబడును.

APPLICATION MODEL - NAVYA
Name :
Father's Name :
Address :
Pincode ... Dist
Ph/Cell No.
Qualification :
Nearest Study Centre :
Reservation:
Place :
Date : Signature

శిక్షణానంతరం కేంద్రప్రభుత్వ రంగ సంస్థ ఆమోదిత సర్టిఫికెట్ జారీ చేస్తారు. ప్రతిభగల అభ్యర్థులకు ప్లేస్‌మెంట్ అసిస్టెన్స్ విద్యార్హత ప్రతిభ ఆధారంగా సాఫ్ట్‌వేర్, మల్టీమీడియా రంగంలో నెలకు 5000 నుంచి 30000 వరకు సంపాదించే అవకాశం కలదు.

దరఖాస్తువిధానం: అర్హత, ఆసక్తి గలవారు తెల్లకాగితం పై పేరు, తండ్రి పేరు, చిరునామా, జిల్లా, ఫోన్/సెల్ నెం. విద్యార్హత, శిక్షణ కేంద్రం, రిజర్వేషన్ వివరాలను తెలుపి 5 రూపాయల స్టాంపు అంటించిన స్వంత చిరునామా గల కవరును జతచేసి పోస్టు లేదా కొరియర్ ద్వారా 15 రోజుల లోగా క్రింద తెలిపిన అడ్రస్ / చిరునామాకు పంపవలెను

హాస్టల్ ఫెసిలిటీ కలదు.

దరఖాస్తు పంపవలసిన చిరునామా :
NCMDT CENTRE FOR MULTIMEDIA DESIGN & TRAINING
NCMDT Block, C-201, Mayur Kushal Complex,Beside Chermas, Abids,
Hyderabad - 500 001. Ph : 040 - 23298720, 23298721 Cell : 9347525128

మల్టీమీడియా యానిమేషన్ కోర్సులలో శిక్షణ నిర్వహించుటకు కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్/స్టడీ సెంటర్లకై ఫోన్ చేయండి : 9347525128, 9347525124

''రోడ్డు మీద నేను చెప్పిన వరుసలో కార్లు వెళ్తాయి. చూసి అవునో కాదో చెప్పు. వైట్ లెక్సస్, రెడ్ కరోలా, బ్లాక్ హైలాండర్, పోలీస్ వేన్, యుహాల్ మినీ వేన్, పింక్ స్పోర్ట్స్ కారు, టూరిస్ట్ బస్, ఫెడెక్స్ వేన్, బ్లూ పొంటియాక్, షెర్ల అమ్మేసిన కారది. నంబర్ చూడలేదు నువ్వు''

''ఇవన్నీ నిజంగా వెళ్ళాయా?'' షెర్లీ అడిగింది.

''అవును. అదే క్రమంలో వెళ్ళాయి. మీరెక్కడున్నారు!?'' గార్డన్ గొంతులో కూడా ఆశ్చర్యం.

''ఇండియాలో''

''ఇండియాలో?''

''ఎవరితను?''

''ఏమో? ఓ సాధువు''

''ఇప్పుడు ఏ వాహనం వెళ్ళడం లేదు. ఎందుకంటే, ఇంటర్ సెక్షన్‌లో రెడ్ లైట్ పడింది. కుక్కపిల్లతో ఓ చైనీస్ అమ్మాయి వెళ్తూ కనిపిస్తుంది చూడు''

''యస్...యస్''

''గార్డన్. నీ మైక్రోవేవ్ ఓవెన్‌లో నిన్న షి పోట్ల్ నించి తెచ్చిన బురిటో రైస్ బీల్ ఐటమ్ వేడి చేసుకుని తినడానికి పెట్టావు. నీకు ఆకలిగా వుంది. తిను. ఇప్పటికే అది రెండుసార్లు టైమైందన్న సిగ్నల్‌గా మోగింది. గుడ్ నైట్''

లైన్ కట్ చేసాడు ఆ సాధువు. ఆ దంపతులకి అదంతా కలో నిజమో అర్థం కానంత సందిగ్ధంలో పడ్డారు. ఇక్కడ తన పక్కన కూర్చొని చికాగోలో రోడ్డు మీద దృశ్యాలు ఎలా తెలుసుకోగలుగుతున్నాడా?

''ఓకే. ఇంప్రెస్ అయ్యారా? ఇప్పుడు నేను చెప్పేది నమ్ముతారు కాబట్టి ఆ ఫోన్ కాల్ చేయల్సి వచ్చింది. మీరు జ్యోతిష్యుల దగ్గరకి వాళ్ళు చెప్పేది నిజం అనుకుని వెళ్ళకండి. వాళ్ళు చెప్పిన పరిహారం చేయడానికి వెళ్ళండి చాలు''

''ఏం? దీక్షిత్ అంతా కరెక్టే చెప్పారుగా?''

''అంతా అన్నది అబద్ధం. 'మీ గతంలో జరిగిందంతా' అను ఒప్పుకుంటాను. గతంలో జరిగింది శాస్త్రం చక్కగా నేర్చుకునే జ్యోతిష్యుడు తేలిగ్గా చెప్పగలడు. కాని భవిష్యత్తులో జరగబోయేది మాత్రం ఏ జ్యోతిష్యుడూ చెప్పలేడు''

''ఎందుకని?'' ఇద్దరూ ఒకేసారి అడిగారు.

''ఎందుకంటే అది ఎప్పుడూ ఎవరికీ తెలీదు కాబట్టి. తెలిస్తే దేవుడికి చిరాకు.

కారు కర్ణ ప్రయోగ చేరింది. ఆ సాధువు మూట సర్దుకుని చెప్పాడు.

''నేను దిగాల్సిన చోటు వచ్చింది. జయహో'' దిగాడు.

''స్వామీ... ఒక్క మాట. పన్నెండు వేల మైళ్ళ దూరంలో ఎక్కడిదో చూసి చెప్పగలిగారు. భవిష్యత్తులో మాకేం జరుగుతుందో కూడా తెలుస్తుందా?'' అడిగింది షెర్లీ.

''తెలుస్తుంది''

''ఐతే...''

''కాని చెప్పను''

''ఎందుకని? అందుకు ఎంత డబ్బు కావాలంటారు?''

''ఎంతిచ్చినా చెప్పకూడదు''

''చెప్తే ఏమవుతుంది?''

ఆగి వెనక్కి తిరిగి చెప్పాడు సాధువు.

''ఈ కథ తెలుసా? పూర్వం ఇక్కడే హిమాలయాలకి పని మీద వచ్చిన మృత్యు దేవత యముడు ఓ చిలకకి కనిపించాడు. ''ఇక్కడున్నావా?'' అన్నాడాయన. ఆ చిలకని చూసి. దానికి భయం పట్టుకుంది. తనని యముడు గుర్తించి పలకరించాడంటే తనకి చావు మూడిందనుకుంది. యముడు తన పని మీద ఓ గుహలోకి వెళ్ళగానే పక్షిరాజు గరుత్మంతుడిని ప్రార్థించింది. ఆయన రాగానే జరిగింది చెప్పింది. గరుత్మంతుడు దాన్ని తన వీపు మీద ఎక్కించుకుని వేల మైళ్ళ దూరంలోని కన్యాకుమారిలో వదిలేసి వచ్చాడు. గుహలోని తపస్వి ప్రాణాలు తీసుకుని బయటికి వచ్చిన యముడుకి ఆ చిలక కనపడలేదు. తర్వాత ఆయన కన్యాకుమారికి వెళ్ళాడు. అక్కడున్న చిలకని చూసి 'నీ ప్రాణాలు ఈ క్షణంలో ఇక్కడ తీయాలని నాకు దైవ సూచన వుంటే, కొద్ది క్షణాల క్రితం హిమాలయల్లో ఎలా వున్నావా అనుకున్నాను' అని చెప్పి, దాని ప్రాణాలు తీసుకెళ్ళాడు. ఒకవేళ యముడు ఈ దేవ రహస్యం ముందే, దానికి చెప్పి ఉంటే ఆ చిలకని అక్కడికి చేర్చడం దేవుడికి చిరాకే కదా? కాబట్టి జరగబోయేది ఏదీ ఎవరికీ ముందు తెలీదు''

''అవునా. మరి పరిహారం చేసుకోవడం ఎంతో మంచిదన్నారు'' ప్రశ్నించింది షెర్లీ.

''పరిహారం అంటే దైవారాధన తప్ప ఇంకొటి, మరొకటి కాదు. అది వద్దని ఎవరూ చెప్పరుగా''

నాలుగడుగులు వేసి ఆగి మళ్ళీ వెనక్కి వచ్చి ఒంగి వాళ్ళ వంక చూస్తూ చెప్పాడు.

''మీ అబ్బాయి అవకరం వల్ల మీ ఇద్దరికీ కలిగిన ఒత్తిడిని భరించలేక, అందుకు కారణం నువ్వంటే నువ్వంటూ విడిపోవాలనుకుంటున్నారు. కోర్టులో విడాకులకి కేసు కూడా వేసారు. దీక్షిత్ గురించి గార్డన్ చెప్తే ఇద్దరూ ఆఖరి ప్రయత్నంగా ఇండియాకి ఈ యాత్రలో మీ ఇద్దరికీ రాజీ కుదరచ్చన్న ఆశతో వచ్చారు. విడాకుల కేసుని వెనక్కితీసుకోమని నా సలహా''

''ఎందుకని?''

''నే చింపి ఇచ్చిన ఆ కరెన్సీ నోటు ముక్కలు రెండూ షెర్లీ దగ్గర ఉన్నంతకాలం అది మీకు సాధ్యపడదు. వాటిని వేరు చేస్తే నేనేం చెప్పలేను.

''స్వామీ! మాకింకో బిడ్డ పూర్తి ఆరోగ్యంతో పుడతాడా?'' అడిగింది షెర్లీ దీనంగా చూస్తూ.

''జరగబోయేదంతా మిస్టరీగా ఉంచడానికే దేవుడు ఇష్టపడతాడు. భవిష్యత్తులో అవన్నీ జరగకపోతే భారతీయ జ్యోతిష్యం తప్పు అని మీరు అనుకోకూడదని నేనే ఇవన్నీ చెప్పడానికి మీ కారెక్కాను. ఏం షెర్లీ? లేకపోతే నువ్వు పనిచేసే 'హ్యూస్టన్ క్రానికల్‌లో' అలా రాసే దానివి కదా?'' నవ్వుతూ అడిగాడు ఆ సాధువు.

''అవును మరి పరిహారం...'' అమెరికన్ పద్ధతిలో ఆ సాధువు భుజాలెగరేసి, డ్రైవర్ పెట్టే పాద నమస్కారాన్ని అందుకున్నాడు.

వాళ్ళ కారు తన పక్కనించి వెళ్ళేప్పుడాయన ఆగి తన వైపు చూస్తూ దణ్ణం పెడుతున్న ఆ దంపతులిద్దర్నీ చేత్తో ఆశీర్వదిస్తూ అరిచాడు.

''జయహో''

తర్వాత కర్ణ ప్రయాగలో స్నానం చేయడానికి వెళ్ళిపోయాడాయన.

''ఆయనెవరు?'' అడిగింది షెర్లీ ఆ డ్రైవర్‌ని.

''ఏమో? ఎవరా ప్రశ్న అడిగినా 'దేవ రహస్యం' అని జవాబు చెప్తారు'' చెప్పాడు డ్రైవర్.

✻

